ప్రజాశక్తి

మంగళవారం 30 మే 2023

5

శ్రీకాకుళం

2న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన జూన్ రెండో తేదీన మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. జెడ్‌పి సమావేశ మందిరంలో జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో సుమారు 16 స్థానిక, ప్రయివేటు బహుళజాతి సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని పదో తరగతి నుంచి పిజి విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఉప కలెక్టర్ జయదేవి, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'గడప గడప'కూ వెనుకబాటు

- జిల్లాలో సందర్శించాల్సిన కుటుంబాలు 7,26,498
- సందర్శించినవి 3,13,077
- మంత్రులు, ఎమ్మెల్యేలందరిదీ ఒకటే తీరు
- సచివాలయ నిధులు ఖర్చు చేయలేని పరిస్థితి

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను జనానికి వివరించి తద్వారా మైలేజ్ పొందాలన్నది గడప గడపకూ మన ప్రభుత్వం ప్రధాన లక్ష్యం. కార్యక్రమాన్ని అటు ప్రభుత్వం, ఇటు పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జనంలోకి విస్తృతంగా వెళ్లాలని ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమీక్ష చేస్తున్న ప్రతి సందర్భంలోనూ ఎమ్మెల్యేలకు చెప్తూనే ఉన్నారు. కొందరికి గట్టిగా హెచ్చరికలు సైతం జారీ చేశారు. జిల్లాలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సగం లక్ష్యం కూడా చేరుకోలేదు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పర్యటన, కుటుంబాల సందర్శన, సమయం కేటాయింపు విషయంలో ఉదాసీనత కనిపిస్తోంది. స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేలు పంపిన ప్రతిపాదనల ఆధారంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో కొన్ని పరిష్కారమయ్యే పరిస్థితి ఉన్నా, సచివాలయాల సందర్శనలో వెనుకబాటుతో నిధులు ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు, అందిస్తున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఇంటినీ ఎమ్మెల్యేలు సందర్శించేలా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గతేడాది మే 11న ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని అన్ని ఇళ్లకు వెళ్లాలని ప్రజాప్రతినిధులను ఆదేశించింది. ఇందులో భాగంగా వారు పర్యటించిన ప్రాంతాల్లో మౌలిక వసతులు, కనీస సౌకర్యాల కోసం ప్రజల నుంచి వచ్చే వినతుల కోసం సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయిస్తూ ఈ ఏడాది ఆగస్టు 17న జిఒ నంబరు 123 విడుదల చేసింది. పనుల గుర్తింపు, మంజూరు, నిర్వహణ, పర్యవేక్షణపై ప్రత్యేక మార్గదర్శకాలను వెలువరించింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లాకు చెందిన మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఈనెల 24వ తేదీ వరకు సందర్శించిన గ్రామ, వార్డు సచివాలయాలు, కుటుంబాల సందర్శన, సమయం కేటాయింపు ఇలా ఉన్నాయి.

ఆమదాలవలస : 'గడప గడపకు మన ప్రభుత్వం'లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న సీతారాం

జిల్లాలో 7,26,498 కుటుంబాలను సందర్శించాల్సి ఉండగా, ఇప్పటివరకు 3,13,077 కుటుంబాలను (43.10 శాతం) సందర్శించారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే శ్రీకాకుళం నియోజకవర్గంలో 94 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఇప్పటివరకు 57 సచివాలయాలను సందర్శించారు. నియోజకవర్గంలో 1,01,484 కుటుంబాలను కలవాల్సి ఉండగా, ఇప్పటివరకు 52,332 కుటుంబాలను కలుసుకున్నారు. గడప గడపకూ కార్యక్రమానికి 33 రోజులు మాత్రమే కేటాయించారు. పలాస నియోజకవర్గంలో 88 సచివాలయాల్లో పర్యటించాల్సి ఉండగా ఇప్పటివరకు 63 సచివాలయాలను సందర్శించారు. నియోజకవర్గంలో 84,003 కుటుంబాలను కలుసుకోవాల్సి ఉండగా 40,678 కుటుంబాలను కలిశారు. కార్యక్రమం కోసం 83 రోజులు సమయం కేటాయించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం 87 సచివాలయాలను సందర్శించాల్సి ఉండగా 34 సచివాలయాల్లో పర్యటించారు. నియోజకవర్గంలో 78,330 కుటుంబాలను కలవాల్సి ఉండగా 24,372 కుటుంబాలను కలిశారు. గడప గడపకూ కోసం 107 రోజులు కేటాయించారు.

ముగ్గురు ఎమ్మెల్యేలదీ అదే తీరు

అధికార పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేల పరిస్థితి అలానే ఉంది. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నరసన్నపేట నియోజకవర్గంలో 91 గ్రామ, వార్డు సచివాలయాలను సందర్శించాల్సి ఉండగా 42 సచివాలయాల్లో పర్యటించారు. నియోజకవర్గంలో 84,851 కుటుంబాలను కలుసుకోవాల్సి ఉండగా 30,010 కుటుంబాలను కలిశారు. గడప గడపకూ కోసం 114 రోజుల సమయం కేటాయించారు. పాతపట్నం నియోజకవర్గంలో 91 సచివాలయాలను సందర్శించాల్సి ఉండగా, ఇప్పటివరకు 49 సచివాలయాల్లో పర్యటించారు. నియోజకవర్గంలో 88,944 కుటుంబాలను కలుసుకోవాల్సి ఉండగా 36,446 కుటుంబాలను కలిశారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నియోజకవర్గంలో 98 సచివాలయాలను సందర్శించాల్సి ఉండగా 73 సచివాలయాల్లో పర్యటించారు. నియోజకవర్గంలో 97,721 కుటుంబాలను సందర్శించి వారితో మాట్లాడాల్సి ఉండగా 63,006 కుటుంబాలను కలుసుకున్నారు.

సమన్వయకర్తల సందర్శన మరీ అధ్వానం

వైసిపి ఎమ్మెల్యేలు లేని చోట పార్టీ నియమించిన సమన్వయకర్తల సందర్శన మరీ అధ్వానంగా ఉంది. టెక్కలిలో ఈనెల 26వ తేదీ వరకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్నారు. నియోజకవర్గంలో 89 సచివాలయాలను సందర్శించాల్సి ఉండగా ఇప్పటివరకు 26 సచివాలయాల్లో పర్యటించారు. నియోజకవర్గంలో 94,084 కుటుంబాలను కలుసుకుని సంక్షేమ పథకాలను వివరించాల్సి ఉండగా 19,815 కుటుంబాలను సందర్శించారు. కార్యక్రమం కోసం 138 రోజులు కేటాయించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 94 సచివాలయాలను సందర్శించాల్సి ఉండగా సమన్వయకర్త పిరియా సాయిరాజ్ 55 సచివాలయాల్లో పర్యటించారు. నియోజకవర్గంలో 97,081 కుటుంబాలను కలవాల్సి ఉండగా 46,418 కుటుంబాలను కలిశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కోసం 184 రోజులు కేటాయించారు.

పలాస : మాకన్నపల్లి సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న జీడి రైతులు, నాయకులు

'జీడి'కి మద్దతు ధర ఇవ్వాలి

- జీడిపిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- సచివాలయాల వద్ద జీడి రైతుల ధర్నా

ప్రజాశక్తి - పలాస, వజ్రపుకొత్తూరు, సోంపేట

80 కేజీల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని జీడి రైతుల సంఘం, ఎపి రైతుసంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే జీడి పిక్కలను కొనుగోలు చేయాలన్నారు. ఇవే డిమాండ్లపై పలాస మండలంలోని బొడ్డపాడు, మాకన్నపల్లి, గురుదాసుపురం వజ్రపుకొత్తూరు మండలంలోని బెండి, వజ్రపుకొత్తూరు, డోకులపాడు, పల్లిసారథి, బాతుపురం, అక్కుపల్లి, సోంపేట మండలం మామిడిపల్లి సచివాలయాల వద్ద జీడి రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో 80 వేల మంది రైతులకు జీవనాధారంగా ఉన్న జీడి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. వ్యాపారుల దయా దాక్షిణ్యాలకు ప్రభుత్వం వదిలేస్తోందని విమర్శించారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రోజురోజుకూ ధర తగ్గించేస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో జీడిపప్పు ధర మాత్రం విపరీతంగా పెరిగిపోతుందన్నారు. జీడి రైతులు, వినియోగదారులు నష్టపోతుంటే వ్యాపారులు మాత్రం అధిక లాభాలను ఆర్జిస్తున్నారని చెప్పారు. రైతులకు న్యాయం చేయాల్సిన పాలకులు, అధికారులు వ్యాపారుల పక్షాన పనిచేస్తున్నారని విమర్శించారు. రైతు సంక్షేమమని చెప్పున్న ప్రజాప్రతినిధులు జీడి రైతులను ఆదుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. పలాస కేంద్రంగా జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, జీడి అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద రైతులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. జీడి పంట అభివృద్ధికి ప్రోత్సాహకాలు ఇస్తూ, ప్రాంతీయంగా జీడి పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన మొక్కలు, ఎరువులు, పురుగు మందులు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. అనంతరం సచివాలయం ఉద్యోగులకు వినతిపత్రాలను అందజేశారు. సిఐటియు నాయకులు ఎన్.గణపతి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, బొడ్డపాడు, మాకన్నపల్లి సర్పంచ్‌లు తామాడ మదన్, సైని దేశయ్య, ఉప సర్పంచ్ రాపాక పురుషోత్తం, ప్రజాసంఘాల నాయకులు మద్దిల రామారావు, వంకల మాధవరావు, పత్తిరి దానేసు, పోతనపల్లి కుసుమ, రైతు సంఘం వజ్రపుకొత్తూరు మండల అధ్యక్షులు కొర్నాన బాలాజీ, టి.భాస్కరరావు పి.గురయ్య నాయుడు, ఎం.జోగులు, కె.హేమసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

'ఉపాధి' పెండింగ్ బిల్లుల చెల్లింపు

- చేపట్టిన పనుల బిల్లులు తక్షణమే అప్‌లోడ్ చేయాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉపాధి హామీ కింద చేపట్టిన పనులకు సంబంధించి మూడేళ్లుగా సాంకేతిక కారణాలతో చెల్లింపులు కాని బకాయిలతో పాటు ప్రస్తుతం చేపట్టిన పనులకు చెందిన పెండింగ్ బిల్లులనూ చెల్లించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ఉపాధి హామీ, జిజిఎంపి, నాడు-నేడు, పంచాయతీరాజ్ పనులు తదితర అంశాలపై కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు రూ.52 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేయగా, వాటికి చెల్లింపులు చేసినట్లు తెలిపారు. మరో రూ.15.24 కోట్ల మేర చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. ఇవేకాకుండా ఇంకా చెల్లించాల్సిన బిల్లులు ఉంటే వాటిని శనివారం లోగా అప్‌లోడ్ చేస్తే చెల్లింపులు చేస్తారని చెప్పారు. పూర్తిగా చెల్లింపులు జరిగితే కొత్తగా నిధులు మంజూరవుతాయని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఈ విషయంలో ఎంపిడిఒలు, ఎపిఒలు సమన్వయంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. బిల్లుల చెల్లింపులు త్వరగా చేయాలనే ఉద్దేశంతో పనుల నాణ్యతలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇప్పటివరకు 1636 పనులకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. ఇందులో 320 పనులు పూర్తయ్యాయని, 90 పనులకు చెందిన బిల్లులు అప్‌లోడ్ చేశారని చెప్పారు. మిగిలిన పనులు వెంటనే పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ నీటిసరఫరా విభాగం, పంచాయతీరాజ్ శాఖల ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. ఎల్ఎన్‌పేట, పొందూరు, ఎచ్చెర్ల, సారవకోట మండలాలతో పాటు శ్రీకాకుళం, ఆమదాలవలస, ఇచ్ఛాపురం అర్బన్ ప్రాంతాల నుంచి ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కింద డేటా రావాల్సి ఉందన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు, అర్బన్ సెక్రటరీలు చొరవ తీసుకుని డేటాను సేకరించాలని ఆదేశించారు. సమీక్షలో సిపిఒ వి.ఎస్.ఎస్. లక్ష్మీప్రసన్న, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, వంశధార ఎస్ఇ డి.తిరుమలరావు, పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ జయరాంకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'డిమాండ్స్ డే'లో భాగంగా జర్నలిస్టుల సమస్యలపై జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలన్నారు. అక్రిడిటేషన్ల కమిటీల్లో గతంలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎకు ప్రాతినిధ్యం ఉండేదని, అదే విధానాన్ని ఇప్పుడూ కొనసాగించాలని కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు

జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీని నియమించాలన్నారు. జర్నలిస్టులకు గృహ వసతి, పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. కార్మిక బీమా సదుపాయం వర్తింపజేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ కమిటీలను ఏర్పాటు చేయాలని, రూ.50 కోట్ల సంక్షేమ నిధిని కేటాయించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల రక్షణ కోసం చట్టం చేయాలని, జర్నలిస్టుల అవార్డులను పునరుద్ధరించాలని, ఆరోగ్య బీమాను వర్తింపజేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఫెడరేషన్ నాయకులు టి.భీమారావు, బి.చిన్నారావు, ఎస్.విజయకుమార్ తదితరులున్నారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ స్థానిక బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ప్రారంభమైంది. షెడ్యూల్ ప్రకారం మొదటి రోజు ఒకటి నుంచి 12 వేల ర్యాంకు వరకు అర్హత సాధించిన వారి ధ్రువపత్రాలను పరిశీలించారు. కౌన్సెలింగ్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదరరావు అభ్యర్థులకు సూచనలు, సలహాలు అందిస్తూ సీట్ల కేటాయింపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సహాయ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న డి.మురళీకృష్ణ విద్యార్థులు జత చేయాల్సిన పలు ధ్రువపత్రాలకు సంబంధించిన వివరాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. జూన్ ఐదో తేదీ వరకు కౌన్సెలింగ్ కొనసాగనుంది. జిల్లాలోని ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 754 సీట్లు ఉండగా, ఐదు ప్రయివేటు కళాశాలల్లో 1840 సీట్లు పాలిటెక్నిక్ ప్రవేశాలకు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది 11,189 మంది విద్యార్థులు పాలిసెట్‌కు హాజరు కాగా, 9,705 మంది అర్హత సాధించారు. జూన్ తొమ్మిదో తేదీ నుంచి సీట్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

అందరూ ఏకమైనా అంతిమ విజయం వైసిపిదే

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రతిపక్షాలన్నీ ఏకమైనా అంతిమ విజయం వైసిపిదేనని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం నుంచి కృష్ణాపురం జంక్షన్ వరకు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తూ ప్రజల గడప వద్దకే పాలనను తీసుకొచ్చారని కొనియాడారు. మేనిఫేస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసి సంక్షేమం, అభివృద్ధికి చిరునామాగా రాష్ట్రాన్ని నిలిపారని చెప్పారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలు చూడకుండా పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు గ్రామ స్వరాజ్యానికి నాంది పలికాయన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫేస్టోను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వైసిపి పథకాలను కాపీ కొట్టి హామీలిచ్చినా ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదన్నారు. 2014 ఎన్నికల్లోనూ ఇలాగే హామీలిచ్చి, అధికారంలోకొచ్చాక వాటిని అమలు చేయని విషయాన్ని టిడిపి నాయకులు మరిచిపోయినా ప్రజలు మరిచిపోలేదన్నారు. వచ్చే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం

నేడు రాజగోపాలరావు విగ్రహావిష్కరణ

శ్రీకాకుళం : మాజీ ఎంపీ, కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కొత్తరోడ్డు వద్ద ఆయన విగ్రహాన్ని మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆవిష్కరించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం శాంతి కన్వెన్షన్ హాలులో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ఒక ప్రకటనలో కోరారు.

లౌకికవాదానికి బిజెపి తూట్లు

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశంలో లౌకికవాదానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతా మోహన్ విమర్శించారు. నగరంలోని ఒక హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక నియంతృత్వ పోకడలు పెరిగాయని విమర్శించారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించాల్సి ఉన్నా, ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి జాడే లేకుండా చేసిందని విమర్శించారు. ప్రజలు సంక్షేమాన్నే కాదని, అభివృద్ధినీ కోరుకుంటున్నారని చెప్పారు. దళితులను పూర్తిగా దగా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్‌టిఆర్‌ను వెన్నుపోటు పొడిచి మానసిక క్షోభకు గురిచేసిన చంద్రబాబు నాయుడు శత జయంతి ఉత్సవాలను నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో రాష్ట్రం, జిల్లా అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి, నాయకులు సనపల అన్నాజీరావు, డి.మల్లిబాబు, ఆర్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చింతా మోహన్

సమస్యల పరిష్కారంలో యుబి యాజమాన్యం నిర్లక్ష్యం

'స్పందన'లో కార్మికుల ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కార్మికుల సమస్యల పరిష్కారంలో యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని యుబి వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.తేజేశ్వరరావు, అధ్యక్షులు ఇజ్జు నారాయణరావు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలపై ఈనెల పదో తేదీన కలెక్టరేట్‌లో యాజమాన్యానికి, కార్మికులకు మధ్య చర్చలు జరిగాయని, పరిశ్రమను వెంటనే తెరవాలని కలెక్టర్ ఆదేశించినా యాజమాన్యం అమలు చేయలేదన్నారు. దీంతోపాటు కార్మికులకు పూర్తిస్థాయిలో పనిదినాల కల్పన, పని కల్పించని రోజులకు 50 శాతం వేతనాలు చెల్లించాలన్న ఆదేశాలను పాటించలేదని చెప్పారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

వంశధార ప్రాజెక్టు కోసం తమ గ్రామంలో సుమారు 550 ఎకరాల భూములు ఇచ్చామని, ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియో ఇప్పటివరకు తమకు అందలేదంటూ కొత్తూరు మండలం పారాపురానికి చెందిన 17 మంది రైతులు ఫిర్యాదు చేశారు. శ్రీకూర్మం ఆలయానికి దక్షిణ ద్వారం పక్కన ఉన్న ఆరు సెంట్ల స్థలాన్ని ఆలయంలో పనిచేస్తున్న టిపి ఆచార్యులు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారని ఆలయ పాలకమండలి సభ్యులు డబ్బీరు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి స్థలాన్ని తిరిగి ఆలయానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పలు నిబంధనలతో తొలగించిన వికలాంగ పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని, భార్యభర్తలిరువురూ వికలాంగులైతే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు సాయి జనార్ధన్, నర్సింహమూర్తి వినతిపత్రం ఇచ్చారు.

'జగనన్నకు చెబుదాం'లో 137 మంది అసంతృప్తి

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 137 మంది అసంతృప్తిగా ఉన్నారని కలెక్టర్ చెప్పారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి అసంతృప్తికి కారణాలు తెలుసుకుని, సమస్య పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించి 21 ఫిర్యాదులు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. ఇందులో రెవెన్యూశాఖ నుంచి అత్యధికంగా ఎనిమిది పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం జిల్లాలో పలు శాఖల్లో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబసభ్యులు 39 మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. స్పందనలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ఐసిడిఎస్ పీడీ జయదేవి, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీకృష్ణ వినతులు స్వీకరించారు. జిల్లా పరిషత్ సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, డిఎస్‌ఒ వెంకటరమణ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాల్గొన్న చిన్నారులు

ముగిసిన 'వేసవి వినోదం'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుత సమాజంలో పిల్లలు ఫోర్ వాల్స్, సెల్‌ఫోన్, టివిలకు పరమితమై అతుక్కుపోతున్నారని, దీనివల్ల వారిలో ఆత్మన్యూన్యతా భావం పెరిగి పక్కవారితో మాట్లాడలేని స్థితికి చేరుతున్నారని క్రియేటివిటీ చిల్డ్రన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు చింతాడ కృష్ణారావు అన్నారు. అలాంటి స్థితి నుంచి పిల్లలను బాహ్య ప్రపంచంలోకి తీసుకురావడానికి క్లబ్ నిరంతరం ప్రయత్నిస్తుందని వివరించారు. నగరంలోని తిలక్ నగర్‌లో ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న వేసవి వినోదం సోమవారంతో ముగిసింది. ముందుగా చిన్నారులు సృజనాత్మకతకు వారు స్వీయ దర్శకత్వంలో రూపొందించుకున్న మూఢనమ్మకాలు నాటిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జిఎంఎల్ గ్రేసీ ఈ నాటికను రాసి తాను ప్రదర్శించింది. ఈ నెల 23 నుంచి 29 వరకు నిర్వహించిన శిబిరంలో పలు పోటీల విజేతలకు రెండో పట్టణ ఎస్ఐ లక్ష్మి బహుమతులను అందజేశారు. ఈ శిబిరంలో బాల మేధావి రోహిత్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత చింతాడ రామారావు, జనవిజ్ఞాన వేదిక సభ్యులు కొత్తకోట అప్పారావు, వి.శ్రీనివాసరావు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

అర్జీల పరిష్కారంలో జాప్యం ఉండరాదు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రజల అర్జీలు పరిష్కరించడంలో జాప్యం ఉండరాదుని, అర్జీలపై సత్వరం స్పందించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీసు అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ మేరకు 38 మంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కుటుంబ తగాదాలు ఐదు, మోసపూరితమైనవి నాలుగు, ఇతరత కారణాలు 14, ఆస్తి తగాదాలు 11, పాతవి 4 ఫిర్యాదులు వచ్చాయి. పై ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వెంటనే ఎస్‌పి కార్యాలయానికి పోలీసు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సెబ్ జెడి వి.నాగమణి కంఠ, అదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు పాల్గొన్నారు.

వంతెన పునరుద్ధరణ పనుల్లో జాప్యం

కూలిన వంతెనతో తగ్గిన వ్యాపారాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ప్రధాన గ్రామాల రాకపోకలకు బాహుదా రోడ్డు వంతెన పునరుద్ధరణ పనుల జాప్యంపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 3న ఉదయం బాహుదా నదిపై వంతెనపై లారీ వెళ్తున్న సమయంలో కుప్పలికూలింది. ఈ ప్రమాదంలో లారీ దెబ్బతింది. ఈ ఘటన జరిగి 26 రోజులు కావస్తున్నా ఇంతవరకు వంతెన పునరుద్ధరణ పనులు ప్రాంభించలేదు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి రోడ్ల భవనాలశాఖ ఆధ్వర్యాన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు తాత్కాలిక వంతెన నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు వేగవంతంగా చేపడతామని హామీనిచ్చారు. కానీ, ఇప్పటి వరకు ఎటువంటి పనులు ప్రారంభించకపోవడంతో

కూలిన బాహుదా వంతెన (ఫైల్)

ఇచ్ఛాపురం పట్టణంలో అనేక వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ఇచ్ఛాపురం రావాలంటే చుట్టూ తిరిగి బెల్లుపడా, అచ్చంపేట మీదగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పట్టణంలో వ్యాపార రంగంపై వంతెన ప్రభావం పడిందని వ్యాపారుస్తులు ఆందోళన చెందుతున్నారు. వంతెన నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మరో వైపు శాశ్వత వంతెన

మట్టి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నిర్మాణానికి కావాల్సిన మట్టి నమూనా పరీక్షలు జరుగుతుంటే... తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు లేకపోవడంపై పట్టణ వాసులు అధికారుల తీరుపై మండిపుతున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిస్తే... తాత్కాలిక వంతెన నిర్మాణానికి జాప్యం జరిగే అవకాశం ఉందని, వంతెనే వంతెన పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- జలుమూరు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని తిమడాంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, వాటర్ ట్యాంక్, వైఎస్ఆర్ జగనన్న కాలనీ, ఇంటింటి తాగునీటి కుళాయిలను సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రతి సంక్షేమ మహిళల ఖాతాలకు జమ చేస్తున్నారని అనానరు. మాజీ సిఎం చంద్రబాబు నాయుడు జగనన్న కాలనీలకు ఇచ్చిన స్థలాలపై అనుత వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. గత ఐదేళ్లలో సీఎంగా ఉన్న

మాట్లాడుతున్న మంత్రి ధర్మాన

చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలేరని విమర్శించారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి వాన గోపి, మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షులు మొజ్జాడ శ్యామలరావు పాల్గొన్నారు.

'స్పందన'కు 27 వినతులు

టెక్కలి : టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన ఫిర్యాదుల విభాగానికి 27 వినతులు వచ్చాయని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. అధిక భాగం వినతులు ఇళ్ల స్థలాల కోసం వచ్చాయని, వాటిని ఆయా ఆయా విభాగాలకు పంపించామని అన్నారు. మండలంలోని రావివలస గ్రామం వద్ద ఉన్న మెట్‌కోర్ అల్లాయిస్ పరిశ్రమని తెరిపించి కార్మికులకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ యూనియన్ నాయకులు పిట్ట గంగయ్య ఆధ్వర్యాన కార్మికులు వినతిపత్రం అందజేశారు.

కరాటేలో విద్యార్థికి స్వర్ణ పతకం

కోటబొమ్మాళి: ఈ నెల 26 నుంచి 28 వరకు విశాఖపట్నం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇండోనేపాల్ కరాటే ఓపెన్ ఛాంపియన్స్ పోటీల్లో హరిశ్చంద్రపురం ప్రభుత్వ పాఠశాలకు చెందిన కుటికుప్పల శ్యామ్‌కుమార్ అండర్ 10 విభాగంలో స్వర్ణపతకం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నూక లక్ష్మణరావు శ్యామ్‌కుమార్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్యామ్‌కుమార్ హరిశ్చంద్రపురం ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడని, విద్యతోపాటు కరాటేలో ఉత్తీర్ణత సాధించడం తమకు ఉంతో సంతోషంగా ఉందని అన్నారు. శ్యామ్‌కుమార్ తల్లిదండ్రులు కనకరావు, రోహిణిలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సర్పంచ్ గురువెళ్లి కేశవరావు, ఎంపిటిసి బగాది దివాకర్, పూజారి సత్యం, మాజీ సర్పంచ్ పూజారి శైలజ, వ్యవసాయశాఖ ఎఇ పూజారి సత్యనారాయణలు అభినందించారు.

అభినందనలు తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యుత్ వాహనాలు శ్రేయస్కరం

సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ఈ-బైక్‌ను నడుపుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

టెక్కలి : మారుతున్న కాలానికి అనుగుణంగా పరిస్థితులూ మారుతున్నాయని, వాటికి అనుగుణంగా పర్యావరణ హితాన్ని కోరే విధంగా ఉండే వాహనాలను వినియోగించేందుకు వాహనదారులు ఆలోచించాలని సబ్ కలెక్టర్ కోరారు. నెడ్‌క్యాప్ ఆధ్వర్యాన 'గో ఎలక్ట్రిక్ – గో గ్రీన్' అనే అంశంపై అవగాహనా శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో విద్యుత్ వాహనాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పెట్రోల్ వంటి శిలాజ ఇంధనాలు తరిగిపోతున్న పరిస్థితుల్లో విద్యుత్ వాహనాలు వాడడం శ్రేయస్కరమని అన్నారు. దీనివల్ల పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టగలమని అన్నారు. ఈబైక్ వాహనాల వినియోగం ప్రోత్సహించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇటువంటి తరుణంలో ఈ బైక్‌ల వినియోగంపై శ్రద్ధ చూపాలని కోరారు. అనంతరం వాహనాన్ని కొద్ది సేపు నడిపి అందరినీ అలరించారు. కార్యక్రమంలో నెడ్ క్యాప్ జిల్లా మేనేజర్ ఐ.వి.సుబ్రహ్మణ్యం, క్షేత్రస్థాయి అధికారి జి.తిరుపతిరావు, కేనెటిక్, టివిఎస్, ఏతర్ వాహనాల పంపిణీదారులు పాల్గొన్నారు.

విచారణ చేపడుతున్న సిఐ పైడయ్య

కొట్లాటపై కేసు నమోదు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోకర్ణపల్లిలో నారాయణపురం కాలువ సమీపంలో ఇసుకబండి పార్కింగ్ విషయంలో ఆదివారం జరిగిన ఘర్షణపై ఇరు గ్రూపుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు సోమవారం ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. ఈ సంఘటనపై చౌదరి వెంకట అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్.శేషగిరిరావు, ఎస్.చక్రధరరావు, పి.రవి, ఎస్.ధనుంజయరావు, ఆర్.రాధాకృష్ణ, ఎస్.రమణ మూర్తి, సిహెచ్.కిషోర్, ఎన్.పాపినాయుడులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మరో గ్రూపునకు చెందిన సంపతిరావు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిహెచ్.వెంకట అప్పారావు, ఎ.ప్రభాకరరావు, జి.నారాయణ, ఎస్.వెంకటచక్రధర నాయుడు, ఎస్.సింహాచలంలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సిఐ విచారణ

మండలంలో సమస్యాత్మక గ్రామమైన గోకర్ణపల్లిలో ఆదివారం ఇరు గ్రూపుల మధ్యన వివాదం నెలకొని కొట్లాటకు దారితీసిన నేపథ్యంలో సోమవారం ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.పైడయ్య గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొట్లాటకు దారితీసిన కారణాలతో పాటు గ్రామంలో పరిస్థితులపై విచారణ చేపట్టారు. గ్రామంలో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా ఉండేలా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ పికెటింగ్‌లో ఉన్న సిబ్బందికి ఆదేశించారు.

సర్పంచ్ భర్తపై కేసు నమోదు

పొందూరు : మండల కేంద్రంలోని సిస్టం కళాశాల వద్ద జరుగుతున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన పొందూరు సర్పంచ్ భర్త రేగడి గవరరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు సోమవారం తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి ప్రవేశిస్తున్న గవరరాజును విధుల్లో ఉన్న కానిస్టేబుల్ అనంతరావు అడ్డుకున్నారని అన్నారు. దీంతో కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తిస్తూ తాను సర్పంచ్ భర్తని అని, నన్నే అడ్డుకుంటావా? తనని తోసి వేస్తూ అసభ్యకరంగా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

మెళియాపుట్టి : మండలంలోని శేకరాపురం గ్రామ సమీపంలో మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీకి గురైంది. గ్రామానికి చెందిన నెయ్యిల కాంతమ్మ గ్రామ సమీపంలోని ముక్కిడమ్మ గుడి వద్ద సోమవారం పూజ చేస్తుంది. ఈ సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని రెండున్నర తులాల పుస్తెలతాడు తెంపుకొని పరారయ్యారు. బాధితురాలి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ టి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న జానపద కళారూపాలు

వైభవంగా మందస సంబరాలు

మందస : మండల కేంద్రం మందలోని అన్నపూర్ణేశ్వరదేవి గ్రామ దేవత ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మ వారి విగ్రహాలను గ్రామ పురవీధుల్లో సోమవారం ఊరేగించారు. పట్టణమంతా విద్యుత్ అలంకరణ కనువిందు చేస్తుంది. రాత్రి గిడుగు రామ్మూర్తి, బద్రి కూర్మరావు కళా పీఠం ఆధ్వర్యాన జానపద కళారూపాలు పలువురిని ఆకట్టుకుంది.

రాష్ట్ర సమగ్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ

మాట్లాడుతున్న 'గుండ' దంపతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నో సంక్షోభాలను సైతం సమర్ధవంతగా ఎదుర్కొని రాష్ట్రాన్ని విజన్ 2020 దృక్పథంతో అన్ని విధాలా సమగ్రాభివృద్ధి వైపునకు నడిపించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. అరసవల్లిలోని తన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. మహానాడు వేదికగా యువతలో నిరాశ, నిస్పృహలు లేని సమాజం నిర్మాణం కావాలని దిశానిర్దేశం చేశారని అన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు గౌరవభృతి చెల్లిస్తారని చెప్పడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతు సుధాకర్, టిడిపి అధికార జిల్లా ప్రతినిధి ముద్దడ కృష్ణమూర్తినాయుడు, గార మండల అధ్యక్షులు లోపింటి రాధాకృష్ణారెడ్డి, రూరల్ మండల అధ్యక్షులు సీర రమణయ్య, గార మండలం ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్, జిల్లా ఐటిడిపి కో–ఆర్డినేటర్ ప్రధాన విజయరాం, సూరకాసి వెంకటరావు పాల్గొన్నారు.

'సొండి'ల సమస్యల పరిష్కారానికి కృషి

కంచిలి: సొండిల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నర్తు రామారావు హామీనిచ్చారు. మండలంలోని ఎం.ఎస్.పల్లిలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహ సమేత సొండికుల సంక్షేమ సంఘ భవనాన్ని సోమవారం ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రత్నాల కాశీ విశ్వనాథ చౌదరితో కలిసి సోమవారం ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని సొండిల స్థితిగతులు తనకు తెలుసునని, వారి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. కాశీ విశ్వనాథ చౌదరి మాట్లాడుతూ సొండిను ఓబిసిలో చేర్చాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

వైన్ షాపుల్లో సొండిలకు ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, కృష్ణారావు, ఎంపిపి దేవదాస్ రెడ్డి, సర్పంచ్ కొనపల సురేష్, సాంఘ రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, సంఘ నాయకులు ఎస్.దివాకర్, ఎం.సింహాచలం, లక్ష్మీనారాయణ, భాస్కరరావు పాల్గొన్నారు.

6న జిల్లాస్థాయి వర్క్‌షాప్

నరసన్నపేట: అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యాన ఈనెల 6న నరసన్నపేట మండల కేంద్రంలో జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. నరసన్నపేట కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.లెనిన్, పి.రాజేంద్ర పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు సిద్దు, సందీప్ పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి

జిల్లాలో పలు చోట్ల అంబేద్కర్ భవనాలు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజురు చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొకర నారాయణరావు కోరారు. ఈ మేరకు విశాఖపట్నంలోని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జునను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో నందిగాం, పలాస, టెక్కలి మండల కేంద్రాల్లో అంబేద్కర్ భవన నిర్మాణాలకు స్థలం కేటాయించినా నిధులు లేక నిర్మాణాలు

వినతిపత్రం అందజేస్తున్న నారాయణరావు

ముందుకు సాగడం లేదన్నారు. జిల్లాలో పలు మండలాల్లో సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యాన ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మాణాలు చేపట్టాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది నియామకంపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిపై మంత్రి నాగార్జున సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకునేందుకు హామీ నిచ్చారని నారాయణరావు తెలిపారు.

వైసిపి ఫ్లెక్సీపై జనసేన ఆందోళన

ఆందోళన చేస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువన కృష్ణాపురం కూడలి వద్ద వైసిపి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యాన సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన పార్టీ నాయకుల, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా వైసిపి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. పేదవాడికి–పెత్తందారులకు మధ్య పోరాటమని ఫ్లెక్సీలో రాసి ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇసుక, మద్యం, కొండలు తదితర సహజ వనరులను దోచుకునేవారు పేదవారా? అని ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్ దాటికి వైసిపి నాయకులు నిలబడలేక అవాకులు చవాకులు పేలుతూ ఇటువంటి నీచ సంస్కృతికి పాల్పడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు పల్లకిని పవన్ కళ్యాణ్ మోస్తున్నట్లు ఫ్లెక్సీలో ఉండడమే ఈ వివాదానికి కారణమని పలువురు చెబుతున్నారు. ఎస్‌పికి, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఫ్లెక్సీని తొలగించకపోవడంతో ఆందోళన చేపట్టామని అన్నారు. దీంతో ఒకింత గందరగోళం ఏర్పడింది. విషయం తెలుసుకున్న సిఐ పైడయ్య, ఎస్ఐ వై.కృష్ణ నేతృత్వంలో పోలీసులు సంఘటన స్థలానికి జనసేన నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఫ్లెక్సీలు తొలగించకపోతే తగ్గేదే లేదని రామ్మోహనరావు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి అంపిలి విక్రమ్, సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్, జన సైనికులు మజ్జి రాంబాబు, చేపేన రమేష్, సిర్లపు గణేష్, పైడి ధనుంజయ్, తోట అప్పలరాజు, కరుణాసాగర్, చిన్ని, రాము పాల్గొన్నారు.

వేసవి విహారానికి ఆర్‌టిసి బస్సులు

ప్రజాశక్తి- టెక్కలి

వేసవి సెలవుల్లో కుటుంబ సభ్యులతో గడిపేందుకు పలు ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సుల సర్వీస్‌లను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పంచక్షేత్ర దర్శినిలో భాగంగా శ్రీముఖలింగం, అరసవల్లి, శ్రీకూర్మం, రావివలస, ఉమారుద్ర కోటేశ్వరాలయాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. అదే విధంగా అరకు, చాపరాయి, పద్మావతి గార్డెన్స్, బొర్రాగుహలు, గిరిజన మ్యూజియం ప్రాంతాలకు ఒక ప్యాకేజీ చొప్పున బస్సు ఏర్పాటు చేశామన్నారు. భద్రాచలం, ద్వారకా తిరుమల, అన్నవరం ప్రాంతాలకు ఒక ప్యాకేజీ చొప్పున బస్సును ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గల ప్రయాణికులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

టెక్కలి రూరల్ : టెక్కలి ఆంధ్రావీధి సమీపంలో సబ్‌స్టేషన్ 33/11 కెవి హెచ్‌వివిసిబి మంగళవారం అదనంగా ఏర్పాటు చేస్తున్నామని, అందుకు ఉదయం నుంచి పది నుంచి ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.ఎ.రాజశేఖర్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని అంజనాపురం, మేఘవరం పరిధిలో గ్రానైట్ పరిశ్రమలు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. అలాగే రాయవలస సబ్ స్టేషన్ టెక్కలి టౌన్–1 ఫీడర్ మరమ్మతులకు దృష్ట్యా మధ్యాహ్నం 3.30 నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. ఎన్‌టిఆర్ కాలనీ, శ్రీనివాస్‌నగర్, సబ్ కలెక్టర్ కార్యాలయం, ఆర్‌టిసి గ్యారేజ్ పరిధిలోని వినియోగదారుల సహకరించాలని కోరారు.

ఐక్య పోరాటాలు అవసరం

పతాకాన్ని ఆవిష్కరిస్తున్న తాండ్ర అరుణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల తీవ్ర అసమానతలు, ప్రజల జీవితాలను అతలాకుతలమవుతున్నాయని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఝాన్సీ అన్నారు. ఇటువంటి సమయంలో ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఎపి రైతు కూలీ సంఘం జిల్లా మహాసభ సోమవారం నిర్వహించారు. ముందుగా అరుణ పతాకాన్ని రైతుల కూలీ సంఘం జిల్లా కార్యదర్శి తాండ్ర అరుణ ఆవిష్కరించారు. ప్రజా కళాకారులు విప్లవ గీతాలను ఆలపిస్తూ అమరులకు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఉద్యమ చరిత్ర కలకాలం నిలిచిపోయేదిగా ఉంటుందని, ఈ చరిత్రను చెరిపేయడం ఎవరివల్లా సాధ్యం కాదని అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన మూడు నల్ల రైతాంగ చట్టాల వ్యతిరేక పోరాటం ఇంకా ఆగిపోలేదని, మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పీడిత ప్రజలపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జాతీయ ఉపాధ్యక్షులు గణేష్ పాండా, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి పాల్గొన్నారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సభలో నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి.పోలారావు, టి.అరుణ, 11 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాయంత్రం నాలుగు గంటలకు బాపూజీ కళామందిర్ నుంచి ఏడు రోడ్ల, పాత బస్టాండ్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు.

దాతల సాయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి- రణస్థలం

వజ్రపుకోత్తురు మండలం జగన్నాథపురానికి చెందిన సాహుకారి నాగభూషణం రణస్థలం మండలం పైడిభీమవరం పారిశ్రామిక వాడలో ఉన్న అరబిందో పరిశ్రమలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నారు. సాఫీగా సాగుతున్న జీవితం సాగుతుంది. ఇంతలో ఆ కుటుంబానికి పెద్ద ఆపద వచ్చిపడింది. ఎనిమిదేళ్ల తన కుమారుడు సాహుకారి లీలాసాయికి గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఇప్పటికే పలు ఆస్పత్రులకు తిప్పి సుమారుగా రూ.10 లక్షల వరకు అప్పులు చేసి ఖర్చు చేశారు.

లీలాసాయి తల్లితండ్రులు నాగభూషణం, చిన్న మాట్లాడుతూ చాలా ఆస్పత్రులకు తిప్పామని, అయితే తిరుపతిలో ఉన్న పద్మావతి హృదాలయం ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సూచించారని పేర్కొన్నారు. చేతిలో డబ్బులు లేక వైద్య ఖర్చుల కోసం దాతలు సాయం చేయాలన కోరుతున్నారు. ఏడాదిగా ఈయన వ్యాధితో బాధపడుతున్నాడని వారు కన్నీటిపర్యంతమయ్యారు. కష్టపడితేనే రోజు గడిచే కుటుంబానికి ఆపరేషన్ చేయించే అంత పెద్ద

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లీలాసాయి

మొత్తం సమకూర్చుకోవడం కష్టతరంగా ఉందన్నారు. దీంతో దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి లీలాసాయిని కాపాడాలని వారు కోరుతున్నారు. ఆర్థిక సాయం చేయాల్సిన వారు 8374494410 నంబరుకు ఫోన్‌పే చేయాలని, నేరుగా సంప్రదించి సాయం చేయాలని కోరుతున్నారు.

బోరు వేయిస్తున్న సూర శ్రీను

తోటపాలెంలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర శివారున ఉన్న విలీన పంచాయతీ తోటపాలెం ప్రజలకు తాగునీరు లేక గత కొన్ని రోజులుగా తీవ్ర ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు తాగునీటి సమస్యను తీర్చేందుకు వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు ముందుకొచ్చారు. అందులో భాగంగా గ్రామస్తులకు అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసి బోరును తవ్వించి నీటి కుళాయిని ఏర్పాటు చేశారు. వేసవిలో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న వెంటనే ఆయన స్థానికులతో మాట్లాడి బోరు వేయించారు. దీంతో తోటపాలెం ప్రజలు, సచివాలయం సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

బహుమతులను అందజేస్తున్న శ్రీనివాస్ పట్నాయక్

క్రీడల ద్వారా సత్ప్రవర్తన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడల ద్వారా యువత మంచి మార్గంలో నడిచేందుకు తోడ్పడుతుందని దక్షిణ భారత హిందీ ప్రచార సభ కార్యదర్శి శ్రీనివాస పట్నాయక్ అన్నారు. నగరంలోని ఆర్అండ్‌బి అతిథిగృహ ఆవరణలో ఉన్న మైదానంలో కొండబాబు మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ సోమవారం నిర్వహించారు. సంతోషిమాత ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆదిత్య వాకర్స్ క్లబ్ గవర్నర్ పోలు మహంతి ఉమామహేశ్వరరావు, ఫ్రెండ్స్ ఆఫ్ ది ఎర్త్ వాలంటరీ ఆర్గనైజేషన్ రాష్ట్ర కన్వీనర్, డాక్టర్ వినీల పట్నాయక్, సంతోష్‌మాత క్లబ్ కోచ్ రామరాజు, ముని శ్రీనివాసరావు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పురోగతికే 'గడప గడపకు'

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సంక్షేమ పథకాల పురోగతికే గడపగడపకు కార్యక్రమం చేపడుతున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘంలోని 20వ వార్డు వెంగళరావు కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నది? లేనిది? ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అజంతా కుమారి, అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, సాధు ధనుంజయరావు, సంపదరావు రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధర్మారావు

గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి ఈ సౌకర్యాలను కల్పించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సవర ధర్మారావు కోరారు. మండలంలోని జక్కరపేటలో మండల అధ్యక్షులు బందపల్లి రవి అధ్యక్షన గిరిజన సంఘం రెండో మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టాలన్నారు. తాగునీరు, రోడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. గిరిజన గ్రామాలకు షెడ్యూల్ ప్రాంతంగా ప్రకటించి 1/70 చట్టాన్ని వర్తింపజేయాలని కోరారు. మండలంలోని సరియాపట్టి, ముఖలింగపురం ప్రాంతాల్లో రిజర్వాయర్ చేపట్టి గిరిజన భూములకు సాగునీరు అందించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి ఎల్లయ్య, గిరిజన సంఘం మండల అధ్యక్షులు బొంతు అప్పారావు, సుభద్ర మాట్లాడారు. అనంతరం అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జన్ని చిన్నారావు, కార్యదర్శిగా బొంతు అప్పారావు, బొంతు ధర్మారావు, బందపల్లి రవి, సహాయ కార్యదర్శులుగా, ఉపాధ్యక్షులుగా జమ్మయ్య, నారాయణరావులను ఎన్నుకున్నారు.

రిలే నిరాహారదీక్ష చేస్తున్న ఉద్యోగులు

సిపిఎస్ వద్దు... ఒపిఎస్ ముద్దు

ప్రజాశక్తి- రణస్థలం

ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధ్యక్షులు నారాయణరావు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సిని ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను చెల్లించాలన్నారు. దాచుకున్న జిపిఎఫ్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ సంతోష్‌కుమార్, సెక్రెటరీ ఆర్.వెంకటరావు, తాలూకా అధ్యక్షులు జి.వి.ఎం మూర్తి, ఆర్గనైజర్ గురాన చిరంజీవి పాల్గొన్నారు.

పులిహోరను పంపిణీ చేస్తున్న హరికృష్ణ

సంగమేశ్వర ఆలయానికి యాత్రికుల తాకిడి

ఆమదాలవలస : మండలంలోని గాజుల కొల్లివలస పంచాయతీ పరిధిలో కొలువై ఉన్న సంగమేశ్వర స్వామి ఆలయానికి సోమవారం యాత్రికుల తాకిడి పెరింది. ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ యాత్రికులకు ఉచితంగా పులిహోర పంపిణీ చేశారు. దాతలు ముందుకొచ్చి ప్రసాదాలను పంపిణీ చేయాలని కోరారు. సంగమేశ్వర స్వామి కొండను పర్యాటక కేంద్రంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేస్తామని అధికారులు హామీనిచ్చారని, ఆ దిశాగా కృషి చేయాలని కోరారు.

చెక్కును అందజేస్తున్న విమల

పాడి రైతుకు పరిహారం

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురానికి చెందిన పాడి రైతు సీతారామ్మూర్తికి విశాఖ డెయిరీ సంస్థ ప్రతినిధులు సోమవారం నష్టపరిహారాన్ని అందజేశారు. సీతారామ్మూర్తికి చెందిన పాడి ఆవు ఇటీవల మృతి చెందడంతో బీమా కింద రూ.28 వేలు చెక్కును ఎంపిపి మాదిన విమల, మాజీ సర్పంచ్ మాదిన రామారావుల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులకు విశాఖ డెయిరీ సంస్థ అన్ని విధాల తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సూపర్‌వైజర్ ఈశ్వరరావు, వైద్యులు శేఖర్ పాల్గొన్నారు.

రణస్థలం : బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఇచ్ఛాపురం : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

టెక్కలి రూరల్ : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పేదలపై చంద్రబాబుకు చిన్నచూపు

రణస్థలం: రాజధాని ప్రాంతంలోని నిరుపేదల అక్కచెల్లెమ్మల పేరిట ఇళ్ల పట్టాలు పంపిణీ సిఎం జగన్మోహన్‌రెడ్డి పంపిణీ చేస్తే... మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలతో పోల్చి పేదలను దారుణంగా అవమానించారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పేదల ఇళ్ల స్థలాలపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రామతీర్థం కూడలి నుంచి కోష్ట వరకు సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబం గౌరవంగా తలెత్తుకుని జీవించేలా అందరికీ ఇళ్లు అందించే కార్యక్రమం చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, పైడిభీమవరం పిఎసిఎస్, రణస్థలం ఎప్ఎస్‌సిఎస్ అధ్యక్షులు గొర్లె తిరుపతినాయుడు, కిల్లారి రమణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జగనన్న కాలనీ ఇళ్లపై మాజీ సిఎం చంద్రబాబు చేసిన వాఖ్యలకు నిరసనగా సాయంత్రం బైక్ ర్యాలీ ప్రారంభించారు. పట్టణంలోని అన్ని వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించి రాత్రి ముగించారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే నరేశ్ కుమార్ అగర్వాల్, సీడ్ ఏపి చైర్మన్ సాఢి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, దేవదాసురెడ్డి, నరేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేసిన చంద్రబాబు అనిశ్చితి వాఖ్యలకు నిరసనగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి ఆధ్వర్యాన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభించి ఇందిరాగాంధీ, అంబేద్కర్ కూడీలి మీదుగా సాగింది. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి అట్ల సరోజినమ్మ పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వాలంటీర్లే వారధులు

శాసనసభ స్పీకర్ సీతారాం

ఆమదాలవలస : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులే వాలంటీర్లని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అలాగే సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి వార్డు వాలంటీర్లతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలులో వాలంటీర్లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వార్డు సచివాలయ కో-ఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పట్టణ

ఆమదాలవలస : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీను, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుసుమంచి శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాల వారధులుగా వాలంటీర్లు నిలుస్తారని సైనూరు సర్పంచ్ అట్టాడ గోపి అన్నారు. పొల్లాడ సచివాలయం పరిధిలోని వాలంటీర్లకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి గుంటు మాకయ్య, మాజీ సర్పంచ్ ఎం.గున్నమ్మ, సచివాలయ కన్వీనర్లు గోకిన గణపతి, మార్పు రవి పాల్గొన్నారు.

టిడిపి మేనిఫేస్టోతో వైసిపి వెన్నులో వణుకు

మాట్లాడుతున్న గీత

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో టిడిపి ప్రకటించిన మేనిఫేస్టోతో వైసిపి వెన్నులో వణుకు మొదలైందని మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మహిళల కోసం మహాశక్తి పేరుతో ఆడబిడ్డ నిధి ఏర్పాటు చేసి 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న మహిళలు ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ నెలకు రూ.15 వేలు చొప్పున ఐదేళ్ల పాటు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని హామీనిచ్చారని అన్నారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో చదువుకునే పిల్లలందరికీ ఒక్కొరికీ రూ.15 వేలు చొప్పున ప్రోత్సాహకం తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని హామీనిచ్చారని అన్నారు. దీపం పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించామని అన్నారు. జిల్లా పరిధిలో మహిళలు ఎక్కడ నుంచి ఎక్కడికి ప్రయాణించినా ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కొనసాగించవచ్చని అన్నారు. ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలు టిడిపితోనే సాధ్యమన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ తెలుగు మహిళా అధ్యక్షులు బోయిన సునీత, మాజీ కౌన్సిలర్లు కింజరాపు సుప్రియ, గుడ్ల రాజ్యలక్ష్మి, టిడిపి నాయకులు తమ్మినేని విద్యాసాగర్, కింజరాపు శివ తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై రాకపోకలు ఎలా..?

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మండల కేంద్రంలో మురుగు కాలువ నిర్మాణ సామగ్రిని రహదారిపై పడివేయడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పొందూరు పట్టణంలోకి ప్రవేశించే అంబేద్కర్ కూడలి నుంచి కాంప్లెక్స్‌కు వెళ్లే ఈ రహదారిలో పశువుల ఆస్పత్రి వద్ద మురుగు కాలువ నిర్మాణం చేపడుతున్నారు. ఈ కాలువకు సంబందించిన నిర్మాణ సామగ్రి రాళ్లు, ఇసుకను రహదారిపైనే పారబోశారు. దీంతో కాంప్లెక్స్‌కు బస్సులు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో అంబేద్కర్ కూడలి నుంచి లోపలకు రాకుండా నేరుగా ప్రధాన రహదారిపైనే వెళ్లిపోతున్నాయి. దీంతో పట్టణం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలనుకునే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా పట్టణంలోకి వచ్చే ద్విచక్రవాహనదారులు, ఆటోలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం

రోడ్డుకు అడ్డంగా వేసిన చిప్స్, ఇసుక పోగులు

రద్దీగా ఉండే ఈ రహదారిలో నిర్మాణం జరుపుతున్న కాలువ పక్కన ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు అదుపు తప్పితే నేరుగా కాలువలో పడిపోయే అవకాశం ఉందంటూ పలువురు ఆందోళన చెందుతున్నారు. రహదారిపై రాకపోకలు ఇబ్బందులు లేకుండా నిర్మాణ సామగ్రిని తొలగించడంతో పాటు కాలువ పక్కన రక్షణ చర్యలు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న తులసీవరప్రసాదరావు

ప్రజాశక్తి- కొత్తూరు

మెళియాపుట్టి మండలం కేరాసింగ్ గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని పాతపట్నం వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు కోరారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనకుమారిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రహదారి నిర్మాణానికి 2019లో రూ.కోటి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఇటీవల ఆ మండలంలో గడపగడప కార్యక్రమంలో గిరిజనులు గర్భిణిని డోలితో పట్టుకు వెళ్తున్న సంఘటన నేను కళ్లారా చూశానని చలించిపోయారు. నిధులు మంజూరైనా రోడ్డు మార్గానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈయన వెంట మాజీ సర్పంచ్ పడల వెంకటకృష్ణ, గిరిజనులు జి.మల్లేష్, నాయుడు, చినబాబు, అప్పలన్న, సవర చినబాబు ఉన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు కావాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అసంఘటిత రంగంలో పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్న ప్రతి కార్మికుడూ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు కావాలని జిల్లా అసిస్టెంట్ లేబరు ఆఫీసర్ వై.శైలేష్‌కుమార్ పిలుపు నిచ్చారు. శ్రీకాకుళం మండలం సింగుపురంలోని అసంఘటిత రంగ కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగుపురంలో అసంఘటిత రంగ కార్మికులు ఎక్కువ మంది ఉన్నారని, వారిలో ఇప్పటికే 25 కుటుంబాల నుంచి 50 మంది వరకు ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారని అన్నారు. మిగిలిన కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సింగుపురం పంచాయతీ కార్యదర్శి ఎ.రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

రాధాకృష్ణ సేవలు మరువలేనివి

ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

అన్నెపు రాధాకృష్ణ మాస్టార్ తన పంచాయతీకి, టిడిపికి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. మండలంలోని చిట్టేవలస పంచాయతీ తులసిపేటలో రాధాకృష్ణ సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాధాకృష్ణ మృతి టిడిపికి తీరని లోటని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం పార్టీకి పూర్తిస్థాయిలో సేవలందించారని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, యువ న్యాయవాది కె.అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో వచ్చే యాత్రికుల సౌకర్యార్థం షెడ్ నిర్మించేందుకు దాతలు ముందుకొచ్చారు. నగరంలోని చిన్న బరాటం వీధికి చెందిన న్యాయవాది బరాటం నాగేశ్వరరావు, మాలతి దంపతులు, వారి కుమారులు విశ్వనాథం, జోహేన్ కుమార్‌లు రూ.5 లక్షల విరాళాన్ని సోమవారం అందజేశారు. ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్‌ను ఆలయ ప్రాంగణంలో కలిసి చెక్కును అందజేశారు.

జీడికి మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి- సోంపేట

జీడి పిక్కల 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర చెల్లించి జీడి రైతులను ఆదుకోవాలని మామిడిపల్లికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద సంబంధిత అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు చెల్లించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు తెప్పల పాపారావు, పి.కృష్ణమూర్తి, పాతిన ముకుందరావు, టి.రామారావు, జి.పురుషోత్తం, జి.చిన్నపురుషోత్తం, బి.కోదండరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం

లావేరు : విద్యార్థి దశ నుండే క్రమశిక్షణ నేర్చుకోవాలని రిసోర్స్‌పర్సన్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మురపాక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు క్రమశిక్షణ, జనరల్ నాలెడ్జ్‌పై సోమవారం మాట్లాడారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవాటు చేసుకున్నట్లయితే భవిష్యత్‌లో మంచి పరిణామాలు ఎదుర్కొంటారని అన్నారు. తరగతుల్లో చదువు ఒక భాగమేనని, మొట్టమొదట క్రమశిక్షణ అవసరమని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు, విద్యార్థులు, పాఠకులు, ధరావతదారులు పాల్గొన్నారు.

టెక్కలి : జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల కలిగి ఉన్నప్పుడే ఏదైనా సాధించవచ్చునని ఉపాధ్యాయులు ఆర్.నాగభూషణ్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు యోగా ఆసనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.ఉదయకిరణ్, సహాయకులు అమ్మనమ్మ, 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మెమెంటోను అందజేస్తున్న కమిటీ సభ్యులు

'నీలమణి దుర్గ' అమ్మవారి సందర్శన

పాతపట్నం : ఇలవేల్పు ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి అమ్మవారి గ్రామ దేవత మహోత్సవంలో టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు సోమవారం పాల్గొన్నారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానంకావు వీధిలో కన్నవారి ఇంటి వద్ద ఉన్న నీలమణి దుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు మెమెంటోను అందజేశారు. ఈయనతో పాటు ఎంజిఆర్ శ్రేణులు, యువసేన సభ్యులు ఉన్నారు.

బిడ్డు స్వామిని సన్మానిస్తున్న నిర్వాహకులు

బిడ్డు స్వామికి సన్మానం

ప్రజాశక్తి- సోంపేట

దశాబ్దకాలంగా ప్రజా సేవకు అహర్నిశలుగా కృషి చేసిన సంఘ సేవకుడు పి.హరిశ్చంద్రరావు (బిడ్డు స్వామి) సేవలను గుర్తించి సన్మానించారు. సోమవారం విశాఖపట్నంలో నందమూరి తారక రామారావు సేవ స్మారక అవార్డును సంఘ సేవకులు డాక్టర్ గురుగుబెల్లి దామోదరరావు, డాక్టర్ స్వర్ణకుమారి, సంస్థ నిర్వాహకులు పి.ఎ.భాస్కరరావు అందజేసి సన్మానించారు. బిడ్డుస్వామి మండలంలోని బుషాభద్రకు చెందిన వ్యక్తి. ఈ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి 2014లో 30 సెంట్ల భూమిని దానం చేశారు. ఆక్రమణకు గురైన చెరువును అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించారు. పైడిగాం సాగు, తాగునీటి ప్రాజెక్టు సాధనలో బిడ్డుస్వామి తన వంతు కృషి చేశారు.

లోకేష్‌ను కలిసిన భాను

రణస్థలం : నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు రాజమహేంద్రవరంలో ఇటీవల నిర్వహించారు. ఈ మేరకు యువగళం అధినేత నారా లోకేష్‌ను ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ, పోలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, కొంద్రు మురళీమోహన్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావులను కూడా కలిశారు. ఈయనతో పాటు లంక శ్యామ్, పిషిని జగన్నాథం, అప్పడు దొర, దురగాశి రామారావు ఉన్నారు.

లోకేష్‌తో భాను

అవార్డు అందుకుంటున్న శాంతారాం

శాంతారాంకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరుకు చెందిన సంఘ సేవా కార్యకర్త, జిల్లా రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధి కాళ్లకూరి శాంతారాంకు ఆదివారం రాత్రి న్యూఢిల్లీలో జాతీయస్థాయి మదర్ థెరీసా అవార్డును ప్రదానం చేశారు. న్యూఢిల్లీలోని ఆంధ్రా అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ ఆఫ్ ఇండియా సేవా ట్రస్టు సభ్యులు డాక్టర్ దోమన చిన్నారావు, కేంద్ర ఆదాయపు పన్నుశాఖ కమిషనర్ ప్రీతిహరిత్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరించారు. నాలుగున్నర దశాబ్దాల పాటు కళా, సేవా రంగాల్లో ఆయన చేసిన సేవలు మరపురానివని పలువురు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఆలపాటి వరల్డ్ మోటివేషనల్ స్పీకర్ డి.నాగేశ్వరరావు, నేషనల్ అవార్డు కమిటీ చైర్మన్ ఎం.వి.వి.మురళీమోహన్ పాల్గొన్నారు.